వన్నెచిన్నెలు

* * *

—వచ్చేశాడు...

ఏకధాటిని, ఎక్కడా ఆగకుండా సందుమొదటికి వచ్చి... వంతెన అంచున కాలు ఆనించి ఆగిపోయినాడు. ఆట్టే పొద్దుపోక పోయినా...ఆవైపు అప్పటికి అప్పుడే మాటుమణిగింది. పండ బారిన వెన్నెలమూలాన కుపథమైనా, రాజమార్గాన్ని ధిక్క రిస్తూన్నది...

ఒక కాలితో పెడల్‌ను గిర్ మనిపిస్తూ...ఒకక్షణం అనన్యాయత్తమైన నిశ్చలవీక్షణముతో నిరీక్షించాడు; సిగరెట్‌కు, నిదానంగా అంగారలేశసంయోగాన్ని అనుగ్రహించి, చిలవలపలవల తెల్లని పొగ లేడీవలను అలసంగా కమ్ముకోనిస్తూ...వెక్కిరించే చుక్కల మిణుకును లెక్కసేయకుండా...కదలకుండా, ఆలాగే కాచు కుని ఉన్నాడు.

కాని—

ఏమనుకున్నాడో...లాభంలేదని తోచిందేమో...సైకిలును ఓరగించి...తొక్కాడు. వేగభంగానికి చూచాయగా బ్రేక్ వేస్తూ ఆ యింటివైపే చూస్తూ, దాటిపోయినాడు. తిన్నగాపోయి, మలుపు తిరిగి రోడ్డుమీదకు వచ్చి...దిగకుండానే నిమ్మదిగా ఎగువకుపోయి మళ్ళా వెనుకకు తిరిగి...యథాస్థానానికి చేరుకున్నాడు. ఆగదలచు కున్నాడేమో...కాని, నడుపుకుంటూనే వచ్చి, ఆ యింటిదగ్గర... అక్కడ...ఆగిపోయి, సైకిల్‌ను స్టాండువేసి నిలువనిచ్చి...

పెడల్‌ను ఊతంగా తొక్కాడు. బంయ్...య్...జ్...జ్...—హబ్ మోత్రతో వెనుక చక్రము స్పోకున్న అన్నీ ఏకంచేసుకుని, వేగంగా తిరుగుతున్నది...తిరుగు...తూ...న్న...ది.

—ఆగిపోయింది. ఒక్క-నిమిషం ఊరుకున్నాడు. ఎక్కడా అలికిడి లేదు...సిగ్నల్ అందనందువల్ల! మళ్లా రెట్టింపు సత్తువతో...బం...య్...

ఎదురుగుండా...పైన.. మేడమీద కిటికీతలుపు చిరుగాలికి లాగ, కొంచెం ఎడమైంది; క్రమంగా ఓ రెక్క- తెరుచుకున్నది. జుట్టు...నుదురు, కళ్లు, పెదవులు, నవ్వుమొగం, కనబడి...తలుపు కు-న వెనుకకు వాలిపోయింది...

—సిగరెట్ కొడి కేరమ్సుముద్రతో రాల్చి...దమ్ముని లిపి, అగ్నిన్ని కెంపులాగా మూడుసార్లు మెరిపించాడు. ఉహుం...జవాబు లేదు.

ఎత్తినతల వంచకుండనే ..తెలియకుండానే...మళ్ళా పీల్చబోయినాడు. వేలి అంచులకు చురుకు తాకి మెలకువ వచ్చింది. స్టంప్‌ను, సవిమర్శగా పరిశీలించి ఈడ్చి నేలకు వేసికొట్టాడు. రవ్వలు చిందినవి కాని కూటాగ్నికి భంగము రాలేదు.

కొత్తసమిధితో...తిరిగి ధూపారాధన...

—సగం కాలిపోయింది...ఉద్వేగంతో పొగలు గుక్క-తూండటం చేత...

అప్రయత్నంగా బెల్ మీదకు వెళ్ళిన చేతిని మానసబోధతో మరలించుకున్నాడు. కాని, ఆరవంత తాకుడు మిషతో, సైకిల్ కాలు నిలుపలేక ఒరిగి పోయింది...నిశ్శబ్దాన్ని ధిక్క-రిస్తూ...! కలవరపడుతూ, సరిచేదామని వంగి... బార్‌ను గ్రహించబోతూ...వెలుతురు, మీదవాలగా, ఆమాటే అంతలో మరచిపోయి...నిలువబడి పోయినాడు.

కిటికీ రెక్కలన్నీ తెరుచుకుని ఉన్నవి. లైటు ఉన్నది. ఆ అమ్మాయి...తల ఊగించింది: చెయి విసిరాడు. కళ్ళు...ఉభయంగా...ఏవేవో తలపులు చూపులుగా విసురుకున్నవి. మళ్ళా, లోపల చీకటి...!

సైకిల్‌తో ముందుకు నడిచాడు. గోడకు ఆనించి...వేసి సరసను ఉన్న తలుపు నెట్టాడు. గడియ వేసి ఉన్నది. ఇంకో సిగరెట్‌తో...మరో అయిదు నిమిషాలు వేగిరించి, మళ్ళా...

ఈమారు తలుపు...వచ్చేసింది. బెదురు లేకుండా లోపలకు ప్రవేశించాడు. మొదట ఎవరూ కనబడలేదు. కాని...వెంటనే, జాజిపొదమాటున...ఎవరు వారు?

ఆమె తల్లి...

—చిక్కిపోయినాడు...! వెనుక అడుగు వేయడానికి వీలు లేదు...! ధైర్యం చేసి వేద్దామన్నా, పడదు.

'సిగ్గులేదూ. ఎన్నిమార్లు చెప్పాలి? మళ్లా...బ్రాహ్మణులు...చదువుకున్నవారు...'

అతడు ఏమీ మాటాడలేదు: ఆశ్చర్యపడుతూ...ఆమెవంక రెప్పవేయక చూస్తుండగా...

'ఈ ఛాయలకు రావద్దనలేదూ? మర్యాదగా చెపితే వినేటట్టులేదే...!

—భయం తీరుతూన్నది...కాని, ఇంకా గొంతు స్వాధీనం కావడంలేదు.

'సాని అనుకున్నావా?...మా యిల్లు నడిబజారు అనుకున్నావా?'

'సాని అయితే...నాకెందుకూ?'

'కావాలంటే మాత్రం తేరగా ఉండనుకున్నావేం? వృత్తి చేయించవలెననుకుంటే...నీతాతలు...'

'నేను...'

'ఇక, మాట్లాడబోకు...! మాపిల్లకు, మాకు, ఇలాటి వేషాలు సరిపడవు: మేమూ ఘనంగానే బ్రతుకుతున్నాం. పెళ్లి చేయాలనుకుంటూన్నాం. ఎవరన్నా చూస్తే...ఇంకేమన్నా పరువు దక్కుతుందా ?'

'పోనీ... నేను కాకపోతేమానె...బంగారంలాటి పిల్లను... పెళ్లి చేసి చెడగొట్టవద్దు'

'ముందు...నడు...అవతలికి'

'మీకు...డబ్బు కావలసి ఉంటే...'

'నడు...'

—దూరంగా, గుమ్మంలో, ఆ అమ్మాయి నిలుచుని... తల్లికి కనబడకుండా...వెళ్లిపొమ్మని సైగచేసింది—

నిలకడతో అడుగులు వేసుకుంటూ తాపీగా బయటికి వచ్చేశాడు. మాత, సణుగుడు రొదతో తలుపు ధణీమని వేసేసింది.

కిటికీక్రింద...తలఎత్తి చూశాడు...అభ్యాసక్రమాన...

...వెలుతురు...! ఆ అమ్మాయి దరస్మితమధురాననం... కనుసైగలో...ప్రణయామృతం...అభయం...

*　　　*　　　*

కొన్నాళ్లకు...

—ఒత్తుగా పెనవేసుకుని వాలిపోతూన్న తీవెలు...వర్ష ధారలు:

రకరకాల శ్రుతులలో...రంయ్...రం...య్...ప్రధానంగా గాలి హోరు...కటికచీకటి.

పదకొండు కావచ్చింది...

...జట్కా, తోట గుమ్మందగ్గరకు వచ్చి ఆగింది. గుర్రము, తల విదిలించుకుని సకిలించబోతూండగా గాడీవాలా వెన్నుతట్టి ఆపి, కమ్చీ అంచుతో టోపులోపల బద్దలు...రటరట లాడించాడు.

గుమ్మంలోనుంచి...ఎవరో వచ్చి...బండిలోకి ఎక్కినారు. మళ్లకుండా సరాసరి సాగిపోయి...మలుపుతిరిగి రోడ్డు ఎక్కింది, జట్కా. అక్కడ ఇంకొకటి కలుసుకుని...రెండూ దౌడా యించినవి...

ఖాళీబళ్లు తిరిగి సగందూరము వచ్చినతరువాత మెయిల్ కూత వినబడ్డది.

*　　　*　　　*

ఊరంతా గుప్‌మన్నది—శుద్ధ సనాతన దీక్షాపరుల వంశాంకురం ... కుమారస్వామి...కన్నెరికం కాని సానిపిల్లను...తల్లికి తెలియనీకుండా, లేవదీసుకు వెళ్ళిపోయినాడని!

'అసాధ్యుడు...మహా మజా అయినపని జేశాడు. అరి... పిడుగూ! మాకు తెలియనిస్తే...హుషార్‌గా సెండాఫ్ ఇచ్చే వాళ్ళమే...బలే...'

—అని మిత్రులు...సన్నిహితులు అయిన నవ్యాంధ్రి కవి రసికులు:

'కలికాలం...కలౌపంచ సహస్రేషు...! ఇంకాఏం నిదర్శనం కావాలి? వంశమర్యాద...పరువు, ప్రతిష్ఠ గంగలో కలిసిపోయి నవి; శాంతం పాపమ్...రా...మ...'

—అని...ఏ కోరికలూ తీరని—ఏ సరసానికీ నోచుకోని... శుద్ధ నిర్గుణమూర్తులు...వ్యవహారసనాతనులు.

'వీళ్ళకు ఇదే పోయేకాలం: గొప్పకులంవాళ్ళ మనుకుంటూ ... ఈ జాతి అంతా ఇదేరకం! సానిపిల్లను, తేరగా తన్నేసుకు పోదామనుకున్నాడు...! ఈ శాలువల శాస్త్రులగార్లంతా ఏంచెపు తారో కనుక్కుంటూ, పురాణం దగ్గర పట్టుకుని దులపనూ?... పోలీసులకు చెప్పనూ? నే నెవరనుకున్నాడో!... నా పిల్లను పువ్వులలోపెట్టి, తీసుకువచ్చి అప్పగించకపోతే...'

—అని...ఆ అమ్మాయి తల్లి: ఆసలా...కులమువారు అందరూను.

'మాకన్న తండ్రికి...దేశాలు పట్టుకు పోవలసినగతి ఏం వచ్చిందీ? నేనేమున్నా వాడి మాటకు కాదంటానా? ఊరివారం దరూ...తనకు పెట్టి పోషించుతున్నారా, వాళ్లకు భయపడి పరారి కావడానికి? కులం ఏమైతేనేం...మానాయనకు నచ్చిన పిల్ల గుణవంతురాలే...! కోడలిని చూసుకునే ముచ్చట నాకు మాత్రం ఉండదూ? ఎప్పుడు వస్తారోకదా!...మళ్లా కంటికి ఎప్పుడు అగపడుతాడో...'

—అని...ఆతని తల్లి.

*　　*　　*

ఏ దేశాలు తిరిగినా...ఎక్కడ అజ్ఞాతంగా కాలము గడపుకున్నా,...మధుమాస వికాసములో, కోయిలలు మళ్ళిరాక...కో యనక... తప్పుతుందా?

'లోకముతో మనకేటికి' అనో...మరి వాళ్ల ఆలోచనలు ఏమో,...ఆ పావురాజంట తిరిగీగూటిలో వాలింది.

స్వగృహాము...సలక్షణముగా కలకల లాడిపోయింది. సంగీతాలు...సరసోక్తులు, చెలరేగినవి. సనాతనులు ఆ త్రోవను నడవటం మానివేశారు. కాని చూడవచ్చే,...అభినందించి...కూడా ఆనందించాలని వచ్చే స్నేహితులతో...ఎడా తెరిపీ లేదు.

—వర్ణాంతర సంయోజనమైనా...విధ్యుక్త వివాహమేనని, కొందరు అమాయికులు: గాంధర్వము ప్రథమ చరణమని...మరి కొందరు సరిపెట్టుకుని పోయే...మధ్యములు: అవేమీకావు ..ఇంకొకటి, ఏమిటోనని...అవరులు!

కాని, ఎటు ఆలోచించినా...దంపతులేనని అందరూను. అసలు సంగతి మాత్రం...ఎవరికీ తెలియదు.

*　　*　　*

ఇంకా...కొన్నాళ్లకు—

...ఎండ తగ్గినా...ఉడుకు తరగలేదు. పొద్దుగుంకుతూన్నది. వడగాడుపుల తెరలు...అలలై పోతూనే ఉన్నవి. తేరుకు నేందుకు...వీలుకా లేదు...

—ఎవరో...పిలిచారు. స్వామి తల్లి వెళ్లి తలుపుతీసి, అడుగు వెనుకవేసి...గుమ్మానికి పక్కగా ఒత్తిగిలగా...

'ఉన్నారా...మీా అబ్బాయి!' అని...వచ్చిన ఆయన ప్రశ్న.

'ఆఁ...వచ్చి...అలా కూర్చోండి నాయనా...పిలుస్తాను'... అని, ఆప్యాయనంగా...ఆ అమ్మ ఆహ్వానం.

'రండీ!' అంటూ, వెనుకకుతిరిగి హెచ్చరించింది...వెళ్లిపోతూ. ఆయనా...వెంటవచ్చిన ఆమె...ప్రవేశించి, ఆసీనులైనారు.

ఈ అపరిచితులు ఎవరో ఊహించలేక...స్వామితల్లి... అక్కడ నిలువలేదు.

మరి...పది నిమిషాలకు...

సావడిలోకి వస్తూ...మాటలు వినబడగా స్వామి...వసారాలో ఆగిపోయి, ఆలకించడం మొదలుపెట్టాడు:

'పాత కుండను...పాత...కుండను...'

నవ్వుకుంటూ చరాకా వచ్చేశాడు...చూశాడు: గుమ్మంలో కాలు అలాగే నిలిచి పోయింది.

—సోఫాలో, ఠీవిగా...ఆ అమ్మాయి తల్లి: తివాసీ మీాద మోకరిలి...అభయ ముద్రిలతో...ధ్యానమగ్నుడై, ఉపాసనలో మునిగి తేలుతూన్న...రామమూర్తి పంతులు!

'దేవా...నేను, పాత...కుండను: నీవు, ఉత్తముండవు... నీవు, ఉత్త...ముండవు...'

...బిగ్గరగా నవ్వేశాడు. ఆ నైష్ఠికుడు, మిగతా ప్రార్థన కొంచెం తగ్గుస్థాయిని పూర్తి చేసి,...బ్రహ్మా కృపాహి కేవలమ్... అని, అంచెలంచెలుగా రెప్పలు విప్పి...లేచి నిలుచున్నాడు.

‘ నమస్కారం...పంతులుగారూ...’

‘ ఆఁ,..ఆఁ...! మీతో ఒక ..ముఖ్యవిషయం...’

‘ ఆలాగా ...దయ చేయండి. పెద్దలు ... నిలువబడి ఉండటం..’

‘ పడక కుర్చీలో, బలవంతం చేయించుకుంటూ...కూర్చున్నాడు, పంతులుగారు : స్వామి...రాకింగ్ ఛైర్ లో కుషన్ లు తలకు అమరికగా సర్దుకుని...ఊగుతూ...సంసిద్ధుడైనాడు.

ఆగంతుకులు...మౌనముద్రాలంకారులు. ఈ వాలకం కనిపెట్టి...ఇక ఊరుకుండలేక, స్వామి, ఆమెను చూపులతో గిలిగింతగా...

‘ ...ఏం...కులాసాగా ఉంటున్నారా? ’ అని, బంధుప్రేమ ఉట్టిపడుతూండగా పలుకరించాడు. ఆమె...చురచురజూసి, మూగనోము విడువకుండా, తలత్రిప్పుకున్నది ; ఆయన...పెదవులు కదపబోయి, ఊరుకున్నాడు.

—స్వామి, లేచి గుమ్మందాకా వెళ్ళి, లోపలకు...సైగచేసి, మళ్ళావచ్చి కూర్చున్నాడు.

‘ ఫరవా లేదే...అమ్మా...ఏంభయం ? ’ అని, బిగ్గరగా... లాలనతో బ్రతిమాలుతూ...రంగనాయకిని చేయి పట్టుకుని నడిపించుతూ స్వామి తల్లివచ్చి, ఆ అమ్మాయిని వదిలేసి...క్రింద కూర్చున్నది.

‘ రా...రంగా...ఇలా కూర్చో’ అని స్వామి...ఆమెనుచూసి, నిలుచుని పిలిచాడు : వచ్చికూర్చున్నది ఆ పిల్ల.

‘ అమ్మా !... ’

—స్వామీ, పంతులుగారూ, పరస్పరావలోకనమునకు స్వస్తి చెప్పి... 'అమ్మ' వేపు చూశారు: వెన్నూ... పక్కలూ... ఎగురుతూ దుఃఖాభినయారంభమును సూచిస్తూన్నవి.

రంగనాయకి, తల్లి పరసను... వాలింది. మీద చెయివేసి ముఖం తనవేపు మళ్లించుకుంటూ... అమ్మా .. అమ్మా . అని, గాద్గదికముతో పిలిచి... బ్రతిమాలింది.

—ఒకరినొకరు... పెనవేసుకున్నారు.

'మా తల్లి... మళ్లా... కనబడతావనుకోలేదు...' అని వెక్కి వెక్కి... మరీ అదుముకున్నది.

రంగ, సిగ్గుపడుతూ, నవ్వుతో, వదిలించుకుని కొంచెం ఈవలికి జరుగుతుండగా...

'చూడండి... కన్నుల కరువుతీరా...' అని, స్వామి చిలిపితనం చేశాడు.

అందరూ... నవ్వుకున్నారు.

మళ్లా— మౌనం...

'ఏం... ఎవరూ మాటాడరేం ?... విశేషాలు ఏమిటి...? పంతులుగారూ, మీరుకూడా బిడియపడితే ఏలా... వచ్చినపని...'

—అని, స్వామి అంటూన్న మాటల ధోరణిలో దిటవు తెచ్చుకుని... పంతులుగారు,

'రంగనాయకి...'

మాటకు అడ్డంతగిలి... స్వామి—

'రంగను... చూడటానికి వచ్చారా ? శుభం...! నిత్యమూ దయచేయాలని... మనవి: మేమే రావాలనుకుంటూండగా...తీరడం లేదండీ...! మళ్లా, ఊళ్లో ఉండముకూడానా...'

'ఎక్కడికి... ప్రయాణం... అడగవచ్చునా ?'

'ఓ... దాపరికం ఏమీ లేదు... కలకత్తా ?'

'ఎందుకూ ?'

—రంగనాయికి తల్లి... చెంగున లేచి... ముందుకువచ్చి... గగ్గోలుగా...

'వీల్లేదు...! రంగను... మేము తీసుకువెళ్లిపోతాం...! రా అమ్మ,... లెండి పంతులుగారూ...'

—స్వామి... ఏమీ చలించకుండా...

'అవశ్యం. ఎంతవాళ్లకైనా పుట్టింటి అపేక్ష ఉండదూ ? ఏం... రంగా...' అని కొంటె అయినాడు.

'నేను...రాను' అన్నదిధైర్యంగా, రంగ.

'రావూ ..'—నూతనులు ఇద్దరూ ఐక్యకంఠులై సంభ్రమించారు.

'ఊహుఁ..'

'రాక.. మరి'

'ఇక్కడే...అన్నయ్యదగ్గర...ఉంటాను'

'అన్నయ్య! ...ఎవరు ?'

—రంగ ... స్వామివంక కరవుతోచూసింది. స్వామితల్లి నవ్వింది.

పంతులుగారు... తెల్లబోతూ...

'ఇంత పాపం...నాయనా...తగదుసుమా'

—స్వామి, లేచి నిలుచుని, వివేకానందవైఖరిలో...

'పంతులుగారూ! మీకు యీ విషయం ఏమీ తెలియదు. ఇలా అన్నానని అన్యథాభావించకండి. పాపం...కుర్రవాడు...అక్కరకు రావలసినవాడు వృథాగా చెడిపోతున్నాడని...నీతిబోధకోసం,

మేము ఇద్దరం ఉల్ ఫాగా ఉండిపోయి, కళంకితుల మౌతూన్నామని, ఉద్ధరించాలని...వివాహంచేయించి చూసి సంతోషిద్దామని...లేక పోనీ నచ్చచెప్పి, పిల్లను వాళ్ల తల్లికి అప్పగించుదామని...దయ చేశారు, అయినా... ? తమలాంటి ఉత్తములకు వృథాగా శ్రమయిచ్చి నందులకు...మన్నించాలి. ఈ నిమిత్తాన అయినా గృహపావనం చేసినందుకు...మీ దర్శనాలాభ భాగ్యము లభించినందుకు...ధన్యుణ్ణి కాని, మీరు అనుకున్న పాపాలు...ఏవీ...మేము చేయలేదు...చేయ లేము... !'

'అమ్మాయ్...కాఫీకలిపి తీసుకురా...అమ్మ'—అని స్వామి తల్లి, రంగను లోపలికి పంపింది.

'—శ్రీమన్మహాదేవుని ... అక్కడనుంచీ ఎత్తుకుంటాను... కథ...

'...ఓనాడు...జోరుగా సైకిల్ మీద వచ్చేస్తున్నాను, వీళ్ల దోవను. హాయి అయిన సంగీతం వినిపించింది: ఆగాను...! ఆయిల్లు ఎవరిదో తెలియదు...అప్పుడు...

'పాట వినడానికి...వీలైతే, ఆగానమోహిని ఎవరో చూడ టానికి...వీలు ఉన్నప్పుడల్లా... పోనీ వీలుకలిగించుకునే అనండి... అటే రావడం మామూలు చేసుకున్నాను...చూశాను.

'మధ్యమెట్లు వదిలేసి...పైకి దూకుతున్నాను—ఆ గొడవ అంతా మీకు వివరించడము అనవసరం గనుక...'

'పరిచయం,...తరువాత స్నేహం...అంటే అపోహ పడ కండి, వాత్సల్యం...ముదిరినవి. ఇద్దరమూ, తరుచు కలుసుకునే వాళ్లం: ఆమె చక్కదనం ..సంగీతం నన్ను పరవశుని చేసినవి. తోబుట్టువులకు నోచని కొరతను...రంగ తీర్చింది.'

—అంతలో.. రంగ కాఫీ తీసుకువచ్చింది. పొద్దుగూకి మసకదేలడంవల్ల...స్వామి పెద్దలైట్ వేసి ..టీపాయ్ మధ్యకు జరి

పాడు. ఓ గుక్కెడు పుచ్చుకుని, సిగరెట్...అనుమతిమీద... ముట్టించి—

'నేను...అబద్ధమాడుతున్నానేమో నని...నా మాటలు మీరు నమ్మలేకుండా ఉన్నారుకదూ; కాని...నిజం...

'మరి...చెల్లెలు వరుసతోనే అయితే...ఇంత రహస్య మెందుకు...విపరీతవర్తన మేమిటికని మీరు సంశయంతో చవచ్చును! అయితే, మీరే చెప్పండి, సాని యింటికి...అమ్మా, మీ కులధర్మ మును నిందించడంలేదు,—సోదరప్రేమతో వచ్చానంటే...మన్నించి రానిస్తారా...'

'మేము మాత్రం మనుష్యులంకామా...మంచిచెడ్డలు తెలి యవా...తల్లికడుపున పుట్టలేదా?'—అని, రంగ తల్లి గింజుకున్నది. స్వామి, అది వినిపించుకోకుండా...

'మీరు...పెళ్ళి చేస్తారని, రంగ కన్నీటితో చెప్పింది. కులంలో ఖ్యాతి కోసం ఆ అమ్మాయి జీవితాన్ని...'

'ఏం...కానిపనా...మేము కష్టాలన్నీ అనుభవించాము కనుక, పిల్ల ..ఈ వంచనలన్నీ లేకుండా ఒక యింటిదై సుఖపడు తుందని...'

'అవును...రంగ మాత్రం...కాదని, మహాశ్వేతనై పోతానన డంలేదే...? ఎప్పటికో...ఇప్పుడు మాత్రం కాదు. ఒకయింటిది అవుతుందిలెండి—ఈ అనర్ఘమణిని సింగారించుకొనే అర్హుడు లభించి నప్పుడు...

'నేను...సజావుగా ఎంత చెప్పినా, మీరు వినేవారా... అర్థం చేసుకునేవారా? వినరు...కనుకనే రంగ, నేను ఆలోచించే ఈపని చేశాము. ఇంట్లోనే ఉంటే, ఈపాటికి మీకు నచ్చినయింట్లో పడి...తాపత్రయాలలో మునిగి తేలుతూ ఉండేదే...

'లోకంతో', నాకు...మాదృశులకు పేచీ ఎన్నడూ వుండనే ఉన్నది. అయినదానికీ, కానిదానికి ఎవరు ఏమన్నా ఎందుకు లక్ష్యం చేయాలి? ప్రతిఘటించవలసిన అవసరం వస్తేనా...పెద్దల అనుగ్రహాన...అర్థ-అంగ బలములకు...ఏమీలోటులేదు...

'రంగా, నేనూ...కళాతీర్థములు అన్నీ సేవించుకుని వచ్చాము. చక్కదనం అంటే ఏమో,...లోకంలో...ఎన్నిఛాయలు తరళించుతున్నవో...ఈ అందాలరాశికి అర్థమయింది. ఏమికావాలో, ఏ కోరికలు తీర్చుకోవాలో... తెలుసుకున్నది. ఇంకా నేర్చుకుని, మెరుగులు దిద్దుకుంటుంది...! సంగీతం...అభినయం...కలకత్తాలో...

'మరి...తాను ఏరి కోరిన ఆతన్ని...గాంధర్వాన వరించి ధన్యత్వ చేస్తుంది: ఆమె యిష్టము...మన మెవరం నిర్ణయించడానికి? ఏం...తమరు అంగీకరిస్తున్నారా అండి?'

పంతులుగారు, లేచి, అమాంతము స్వామిని కౌగలించుకున్నారు. రంగ తల్లి... కళ్లనీళ్ళకు అడ్డువిడిచి, ప్రాంజలి అయి నిలుచున్నది.

—'నాయనా...ఇక నేను వెళ్ళి మడిగట్టుకుంటాను... బంధువులు ఉన్నప్పుడు పొద్దుపోనీయడం ఎందుకు? రంగా...ఇలా రా...' అంటూ స్వామి తల్లి ఇక కొలువు చాలించాలని సూచించింది.

'నన్ను...క్షమించాలి...నాకు...పనిఉన్నది...'— అంటూ పంతులుగారు మొగమాట పడబోయినారు.

'నేనూ...—' ఆమెతల్లి...మొగంచెల్లక తప్పించుకోవాలని చూసింది.

స్వామి...నవ్వుతూ...

'లాభంలేదు...తప్పించుకుందామనుకుంటూన్నారేమో...! ఏమన్నా...అంత మించిపోయేపనులున్నా, రేపటికి వాయిదావేసేసుకోవాలిసిందే. మీరు...రాత్రికి యిక్కడే ఉండిపోతారని... చిన్న పిల్లలు తప్పిపోయినారేమోనని పెద్దవాళ్లు వెదుక్కోకుండా... యిళ్లకు కబురు చేస్తున్నాను. రంగ, మనకు వడ్డించగా...భోజనం చేసే అవకాశం... తిరిగీ యింతటిలో రాదు. లెండి...తోటలో కూర్చుందాం...'

...వీధితలుపు వేశాడు!

* *
*